'దృష్టికోణ్' విజ్ఞాన ప్రదర్శన


ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన మ్యాథమేటిక్స్ హౌజ్

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా హైస్కూల్‌లో 'దృష్టికోణ్' పేరుతో శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఆహుతులను ఆలోచింపజేసింది. అసోసియేషన్ ఆఫ్ అకౌంటింగ్ టెక్నీషియన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కలకత్తా డైరెక్టర్ డాక్టర్ కేవీ అచలపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల ఏర్పాటు వలన విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మి, హెచ్ ఆర్ భాను, ప్రిన్సిపాల్ తనుప్రీత్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్, హెచ్ఎం నాజ్మా తదితరులున్నారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది రేపే

- కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు..
- 14 టేబుళ్లు..16 రౌండ్లు..
- 17వ రౌండ్‌లో ఐదు టేబుళ్లలో ఐదు బూత్‌ల కౌంటింగ్..
- ఫలితంపై అంతటా ఉత్కంఠ


కౌంటింగ్ జరిగే ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

సనత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సనత్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి ఓట్ల లెక్కింపు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరగనుంది. ఆదివారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు తెలిపారు. కౌంటింగ్ జరిగే తీరును శుక్రవారం ఆయన వెల్లడించారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,49,021 ఓట్లు ఉండగా 1,29,146 (51.95 శాతం) పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 229 పోలింగ్ బూత్‌ల ద్వారా పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలైన అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు గాను కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్ల ద్వారా 16 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుంది. 14 టేబుళ్లలో పూర్తిగా 16 రౌండ్లు జరగగా 17వ రౌండ్‌లో చివరి ఐదు బూత్‌ల (225 నుంచి 229 వరకు)కు సంబంధించి ఐదు టేబుళ్లలో మాత్రమే ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.

విధుల్లో 120 మంది సిబ్బంది

సనత్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు గాను ఎన్నికల అధికారులు 120 మంది సిబ్బందిని నియమించారు. శాసనసభకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటుచేయగా ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు అధికారులు ఉంటారు. కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లు ప్రతి టేబుల్ వద్ద విధులు నిర్వర్తించి కౌంటింగ్ జరుపుతారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, అబ్జర్వర్‌లు, అసిస్టెంట్లు కలుపుకుని 120 మంది విధుల్లో పాల్గొంటున్నారు.

అభ్యర్థుల తరపున ఏజెంట్లకు అనుమతి...

ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థికి సంబంధించిన ఏజెంట్‌ను ఓట్ల లెక్కింపునకు పరిశీలించేందుకు అనుమతిస్తారు. వారి సమక్షంలో అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగిస్తారు. ఏ బూత్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఈవీఎంలో వచ్చే డిస్‌ప్లేను చూపిస్తారు. ఒకవేళ ఏదైనా బూత్‌లో ఓట్లపై సందేహంగా ఉండి ఏజెంట్లు అభ్యర్థన పెట్టుకుంటే మరోసారి ఈవీఎంను డిస్‌ప్లే చేసి చూపిస్తారు.

ఒక్కో రౌండ్ 15 నిమిషాలు.... నాలుగు గంటల్లో కౌంటింగ్ పూర్తి...

14 టేబుళ్లకు గాను ఒక్కో రౌండ్ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేందుకు 15 నిమిషాల వ్యవధి పడుతుంది. ఈ లెక్కన 16 రౌండ్లు పూర్తయ్యేందుకు నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ నుంచి 16 మంది అభ్యర్థులు పోటీ చేసిన విషయం తెలిసిందే. వీరందరి ఓట్ల లెక్కింపుతో పాటు నోటా ఓట్ల లెక్కింపు కూడా జరపాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఒక్కో ఈవీఎంలో ఒక్కో అభ్యర్థికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరిపేందుకు 10 సెకన్ల సమయం తీసుకుంటుంది. 16 మందితో పాటు నోటాకు పోలైన ఓట్ల లెక్కింపునకు దాదాపు మూడు నిమిషాలకు పైగా సమయం పడుతుంది. దీంతో పాటు ఏజెంట్ల సంతకాలు, అబ్జర్వర్ క్రాస్ చెకింగ్ వంటి వాటిని కలుపుకుంటే ఒక్కో రౌండ్ 15 నిమిషాల సమయం పడుతుందన్న మాట.


మొదటి గంటలోనే తేలిపోనున్న అభ్యర్థుల భవితవ్యం

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుండగా తొలి గంటలో నాలుగైదు రౌండ్ల వరకు పోలింగ్ పూర్తవుతుంది. అంటే 70 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఓట్ల తీర్పు బయట పడనుంది. ఆయా రౌండ్లలో వచ్చిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఆధారంగా వారి భవితవ్యం తేలిపోనున్నదని రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.




అంతుచిక్కని ఓటరు నాడి

- తలలు పట్టుకుంటున్న నేతలు..
- గత మూడు పర్యాయాలుగా పోలింగ్ శాతంలో మార్పు ఏదీ..
- అత్యధికంగా రాంగోపాల్‌పేట.. అత్యల్పంగా అమీర్‌పేటలో పోలింగ్ శాతం..
- బన్సీలాల్‌పేట, సనత్‌నగర్‌లలో అత్యధిక ఓటర్లు..


తలసాని శ్రీనివాస్ యాదవ్


కోట నీలిమ


మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఓటరు తన తీర్పును రిజర్వ్ చేశాడు. తుది క్షణం వరకు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డారు. నియోజకవర్గ బరిలో మొత్తం 16 మంది ఉండగా ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉందనేది సుస్పష్టం. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల పెద్దలు సనత్‌నగర్ నియోజకవర్గాన్ని పలు మార్లు చుట్టేశారు. ఇక తీర్పు వెలువడడమే మిగిలింది. అయితే ఓటరు నాడి మాత్రం ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఎన్నికల ప్రచారంలో పార్టీల కేడర్ హడావిడి కనిపించడమే తప్ప ఓటర్ల మదిలో ఏముందో అర్థంకాలేదు. అదేవిధంగా పోలింగ్ సరళిని చూస్తే ఓటర్లు ఎవరికి మొగ్గు చూపారోనని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. గత మూడు పర్యాయాలుగా నియోజకవర్గంలో ఒకేవిధమైన పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటిగా 2014లో జరిగిన ఎన్నికల్లో 52.87 శాతం, 2018లో జరిగిన ఎన్నికల్లో 52 శాతం, ఈ ఎన్నికల్లో 51.95 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ శాతం ఒక్కటే అయినప్పటికీ గత ఎన్నికలతో పోలిస్తే అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఈ సారి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు గట్టి పోటీనే ఇవ్వడమే కాదు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మారిన రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఓటరు ఎటువైపు ఆసక్తి కనబరిచాడో అర్థంకాక నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎవరికి వారు గెలుపు తమదేనని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం మదనపడుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను హ్యాట్రిక్‌ను తెచ్చిపెడతాయన్న విశ్వాసంతో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు బీజేపీ ప్రకటించిన బీసీ ముఖ్యమంత్రి, ఉచిత విద్య, వైద్యం వంటి హామీలతో పాటు గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఈ సారి గెలిపిస్తాయని ఆ పార్టీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి గంపెడాశలు పెట్టుకున్నారు. నియోజకవర్గం నుంచి మొదటి సారి పోటీలో ఉన్న స్థానికేతురాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట నీలిమ ఆ పార్టీ ఆరు గ్యారంటీల పైనే పూర్తి భరోసా పెట్టుకున్నారు. నియోజకవర్గ చరిత్రలో వరుసగా మూడుసార్లు గెలిచిన అభ్యర్థులు ఇంతవరకు ఎవరూ లేరు. గతంలో ఇక్కడి నుంచి గెలిచిన మర్రి శశిధర్‌రెడ్డి నాలుగు సార్లు గెలిచినప్పటికీ వరుసగా గెలిచిన దాఖలాలు లేవు. ఈ సారి హ్యాట్రిక్ విజయం కోసం బరిలోకి దిగిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజయం సాధిస్తే మాత్రం నియోజకవర్గంలో రికార్డు సాధించినట్లే.

డివిజన్ల వారీగా పోలింగ్ శాతం

డివిజన్	శాతం
సనత్‌నగర్	47.95
అమీర్‌పేట	44.40
బేగంపేట	52.59
రాంగోపాల్‌పేట	58.21
మోండా మార్కెట్	61.02
బన్సీలాల్‌పేట	55.42

అత్యధికం రాంగోపాల్‌పేట.. అత్యల్పం అమీర్‌పేట..

పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే నియోజకవర్గంలో అత్యధికంగా రాంగోపాల్‌పేట డివిజన్‌లో 58.21 శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా అమీర్‌పేట డివిజన్‌లో 44.40 శాతం నమోదైంది. అయితే ఓటర్ల పరంగా సనత్‌నగర్, బన్సీలాల్‌పేట డివిజన్లలో అత్యధికంగా ఉన్నారు. సనత్‌నగర్‌లో 60,608 ఓటర్లకు గాను 29,061 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే బన్సీలాల్‌పేట డివిజన్‌లో 64,137 మంది ఓటర్లకు గాను 35,550 మంది ఓటు వేశారు. ఈ రెండు డివిజన్లలో ఎవరు అత్యధిక మెజార్టీని సాధించగలుగుతారో వారే విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

9న సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్, వై. అమృత

కాచిగూడ: శ్రీ ఆంజనేయ సేవా సమితి 8వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 9న అన్నవరం సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు సమితి సంయోజకులు డీఆర్ఎస్ నరేంద్ర తెలిపారు. శుక్రవారం కాచిగూడ, నింబోలి అడ్డ శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం పోస్టర్‌ను బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆవిష్కరించారు. ఎనిమిదేళ్లుగా శ్రీ ఆంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, బీజేపీ నేతలు శ్యాంరాజ్, రమేష్ యాదవ్, ఆనంద్‌గౌడ్, అచ్చిని మహేష్, చుక్కా జగన్, జాటోతు పవన్, గుండగోని నరేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లికి 'ఆర్ట్ గ్యాలరీ' తరలింపు

కాచిగూడ: మేడ్చల్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అద్భుత కళాఖండాల 'ఆర్ట్ గ్యాలరీ'ని కొంపల్లిలోని నూతన ప్రాంగణంలోకి మార్చినట్లు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. అనంతరం బర్కత్‌పురలోని సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ అద్భుత కమల హస్త కళాఖండాల భాండాగారం (ఆర్ట్ గ్యాలరీ) ప్రపంచ తెలుగు ప్రజలను అబ్బురపరుస్తోందన్నారు. 11 ప్రపంచ రికార్డుల గ్రహీత, హస్తకళాకారిణి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ పి.కమల ప్రసాదరావును అభినందించారు. కార్యక్రమంలో రసమయి డాక్టర్ యం.కె.రాము, వంశీ రామరాజు, మహ్మద్ రఫీ, అమరకాంత రెడ్డి, సారిపల్లి కొండలరావు, డాక్టర్ ప్రసాద్ తోటకూర, కల్పన శ్రీకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు



కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ వైద్యులు, ఏఆర్‌టీ సిబ్బంది

'గాంధీ' సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపించవద్దని, వారిలో మనోధైర్యం కల్పించేందుకు కృషి చేయాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ యాంటీ రిట్రివల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ గాంధీ ఏఆర్‌టీ సెంటర్‌లో 18,262 మంది ఎయిడ్స్, హెచ్ఐవీ రోగులు తమ పేర్లను నమోదు చేసుకోగా, ప్రస్తుతం 13,289 మందికి డ్రగ్స్, మందులు, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గాంధీ ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు, సిబ్బంది ఎంతో మెరుగైన వైద్యసేవలు అందించి, రోగుల్లో మానసిక ఆనందాన్ని నింపుతున్నారని, వారి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం హెచ్‌ఐవీ గర్భిణీలు, బాలింతల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు, ఫీడింగ్ కార్నర్ రూమ్‌లను సూపరింటెండెంట్ రాజారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ వినయ్‌శేఖర్, ఆర్ఎంఓ-1 జయకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ అంబుజ, డాక్టర్ ఐశ్వర్య, రాధికఆరోహి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలర్స్ ఉత్సవ్ మేళా రేపటితో ఆఖరు


ఆకట్టుకుంటున్న ఏలియన్స్


ఎగ్జిబిషన్‌లోని గేమింగ్ జోన్

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన చంద్రయాన్-3 సెటప్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కలర్స్ ఉత్సవ్ మేళా పేరుతో ఏర్పాటు చేసిన చంద్రయాన్-3 సెటప్‌లో పిల్లలకు విజ్ఞానాన్ని పంచే విదంగా ఏర్పాటు చేసిన రాకెట్ లాంచర్, రోవర్, చంద్రుడి దక్షిణ దృవంతో పాటు ఏలియన్స్‌ను ఏర్పాటు చేసిన తీరు ఎంతో అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానాన్ని పంచేలా ఏర్పాటు చేసిన చంద్రయాన్ 3, రోవర్, ఏలియన్స్‌తో కూడిన రోదసి ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. ఎంతో అద్భుతంగా శ్రీహరి కోట సెటప్‌తో రూపొందించిన ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 3న ముగుస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు. రాకెట్ లాంచింగ్, రోవర్ దక్షిణ ధ్రువంపై ఎలా ల్యాండ్ అవుతుంది, రోదసీలో ఏలియన్స్ ఎలా ఉంటాయి అని ప్రత్యేకంగా రూపకల్పన చేసి ఏర్పాటుచేసిన తీరు అద్భుతంగా ఉందని సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు గేమింగ్ జోన్, షాపింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.23, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 8, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 20, పందిరి బీర 28, క్యాబేజీ 11, క్యారెట్ 23, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 28, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 22, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

తలసాని గెలవాలని పూజలు



రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విజయం సాధించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం గణపతి దేవాలయంలో అత్తెల్లి అరుణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు పూజలు చేసి మంత్రి విజయం సాధించాలని మొక్కుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం




రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై ఉన్న ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. గత నెల 26వ తేదీన ఎస్పీ రోడ్‌లోని హోండా షోరూమ్ వద్ద ఫుట్‌పాత్‌పై 55 నుంచి 60 ఏళ్ల వయసుండే ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో విచారించినా ఆమె వివరాలు తెలియ రాలేదు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతురాలి ఒంటిపై ఎరుపు, నీలం రంగు చొక్కా ధరించి ఉందని మృతురాలికి సంబంధీకులు ఎవరైనా ఉంటే రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఎందుకో.. ఏమో..!

- లష్కర్‌లో తగ్గిన పోలింగ్ శాతం
- స్పందన లేని రైల్వే కాలనీలు
- విద్యావంతులు ఓటింగ్‌కు దూరం
- బస్తీల్లోనూ అంతంత మాత్రమే

సికింద్రాబాద్: ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి రావాలని, ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఆశించిన ఫలితాలు రాలేదు. ఆసాంతం మందకొడిగా సాగిన శాసనసభ ఎన్నికల పోలింగ్ మొత్తంగా తగ్గుముఖం పట్టింది. ఈ పరిణామం మూడు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తుంది. బస్తీలలో ఎక్కువశాతం ఓట్లు పోలవడం, కాలనీల ఓట్లు, రైల్వే ఓట్లు అంతంతమాత్రంగా పోలవడంతో ఏ పార్టీ అభ్యర్థులకు ఎంతమేర లాభం చేకూరుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సికింద్రాబద్ నియోజకవర్గం పరిధిలో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లలో మినహా ఎక్కడా చెప్పుకోదగిన పోలింగ్ జరుగలేదు. కాలనీల ఓటర్లు అంతంతమాత్రంగానే ఓటింగ్‌కు వచ్చారు. ఈ ప్రాంతంలో చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్న రైల్వే కుటుంబాల ఓటర్లు ఎప్పటి మాదిరిగానే పోలింగ్‌స్టేషన్లకు రాలేదు. నియోజకవర్గం మొత్తం మీద పోలింగ్ శాతం 53.75 శాతం నమోదైంది.


సికింద్రాబాద్ నియోజకవర్గం ముఖచిత్రం

లెక్కలేసుకుంటున్న నేతలు

ఓటింగ్ తీరుపై నియోజకవర్గంలోని అన్ని రాజకీయపార్టీల్లో విశ్లేషణలు జరుగుతున్నాయి. బూత్‌ల వారిగా పోలైన ఓట్లజాబితాను ముందేసుకుని ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి అనుచరులు లెక్కలు వేసుకుంటున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో ఓ మోస్తరు ఓటింగ్ జరగడం పట్ల ప్రధాన రాజకీయ పార్టీల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎప్పుడూ అతి తక్కువ ఓట్లు పోలయ్యే మెట్టుగూడ డివిజన్ పరిస్థితిలో మార్పురాలేదు. ఇక్కడ ఎక్కువశాతం రైల్వే కుటుంబాలు, రైల్వే కాలనీలు ఉన్న ఫలితంగానే పోలింగ్‌శాతం తక్కువగా నమోదు అవుతుంది. తార్నాక డివిజన్‌లో ఓటింగ్‌శాతం మాత్రం చెప్పుకోదగిన స్థాయిలో జరుగలేదు. అడ్డగుట్ట డివిజన్‌లో భారీగా పోలింగ్ అవుతుందని అందరు భావించారు. ఇక్కడి మురికివాడల ప్రజలు సైతం ఓటింగ్‌కు అంతంతమాత్రంగానే హాజరయ్యారు.

పోలింగ్ తీరు...

రైల్వే ఓటర్లు ప్రతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలకు కూడా దూరంగా ఉన్నారు. రైల్వే కాలనీలు, రైల్వే కుటుంబాలు నవసిస్తున్న ప్రాంతాల్లో మరీ తక్కువగా ఓటింగ్ నమోదైంది. రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ భవనంలోని 30, 31 పోలింగ్‌బూత్‌లలో 29 శాతం పోలింగ్ నమోదైంది. రెండు బూత్‌లలో 1623 ఓటర్లు ఉండగా 734 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో 220 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎక్కువ సంఖ్యలోని పోలింగ్ బూత్‌లలో 34 నుంచి 40 శాతం పోలింగ్ దాటలేదు. బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూ అశోక్‌నగర్‌కు చెందిన కేవలం రెండు పోలింగ్ బూత్‌లలో 70 శాతంకు మించి భారీ పోలింగ్ జరిగింది. ఈ రెండు బూత్‌లలో 2092 ఓటర్లు ఉండగా 1364 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,62,517 ఓటర్లలో 1,41,104 ఓటర్లు మాత్రమే ఓటింగ్‌కు హాజరయ్యారు. అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 25 మంది థర్డ్ జెండర్లు ఉండగా ఇందులో 9 మంది మాత్రమే పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.

వైభవంగా శత చండీ మహాయాగం

వెంకటేశ్వరనగర్‌కాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబర్-14లోని శ్రీవిజయ గణపతి ఆలయంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న శత రుద్ర యాగ సహిత శత చండీ మహా యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 25న ప్రారంభమైన మహాయాగం ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం మహాన్యాస పారాయణం, శత చండీ రుద్ర పారాయణం, హోమం, రుద్ర హవనాలు, రాత్రి చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఆయా పూజల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి


నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

లిబర్టీ: దళిత బహుజన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బండారు లావణ్య నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జీవన స్థితిగతుల్లో మార్పు కోసం అంబేద్కర్ స్ఫూర్తితో బలమైన పోరాటాలు చేస్తారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



వెంగళరావునగర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడ ఆర్‌బీఆర్ క్వార్టర్స్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. మధురానగర్ పోలీసులు శవ పంచనామా చేశారు. మృతుడికి దాదాపు 55 సంవత్సరాలు ఉండొచ్చని, బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించాడన్నారు. భిక్షాటన చేసే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని వారు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి సంబంధీకులు ఉంటే మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ మాధవిరెడ్డి కోరారు.

స్ఫూర్తిప్రదాత ఈశ్వరీబాయి


ఈశ్వరీబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు

లిబర్టీ: దళితుల అభ్యున్నతి కోసం ఈశ్వరీబాయి జీవితాంతం శ్రమించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. ఈశ్వరీబాయిని స్ఫూర్తిగా తీసుకొని దళిత బహుజనులు తమ హక్కుల కోసం పోరాటం సాగించాలని కోరారు. ఈశ్వరీబాయి జయంతిని శుక్రవారం మాల మహానాడు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ఈశ్వరీబాయి కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా అణగారిన వర్గాల కోసం దళితుల కోసం కృషి చేశారని గుర్తు చేశారు.

సిఐసీ సిమెట్రీలో విజయ్‌కుమార్ అంత్యక్రియలు


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బ్రదర్ అనిల్‌కుమార్

రసూల్‌పురా: గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌టీపీ మల్కాజ్‌గిరి ఇంచార్జి, ప్రముఖ క్రైస్తవ నాయకులు ఫ్రాన్సిస్ విజయ్‌కుమార్ (37) అంత్యక్రియలు శుక్రవారం తిరుమలగిరిలోని సీఐసీ సిమెట్రీలో జరిగాయి. గురువారం గుండెపోటు రావడంతో స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈయన అంత్యక్రియల్లో బ్రదర్ అనిల్‌కుమార్, సీఎస్ఐ చర్చి పాస్టర్లు బిషప్ విల్సన్ సింగం, హైకోర్టు అడ్వకేట్ సుధీర్ చాటల్ల, కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ నాయకులు బెట్టిన లంక ఎంజిల్, కాంగ్రెస్ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఇంచార్జి యేహెజ్కేలు, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, ఎడ్వర్డ్ సామ్యూల్, జవహర్ కెన్నెడి, జేరుషలేము మత్తయ్య బిషప్ భాస్కర్ ముల్కల తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర, రక్తదాన శిబిరం

నల్లకుంట: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సక్షమ్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం(నేడు) నేత్ర, రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గోల్నాక తులసీ నగర్ పార్కులో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా తులసీనగర్‌లో దివ్యాంగ చిన్నారులకు ఉచిత ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపి, బిహేవియర్ థెరపి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సేవా భావం కలిగిన వారు ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు.